పీహెచ్‌సీలో సిబ్బంది కొరత

- ఏఎన్‌ఎంలు, నర్సులు లేక అందని వైద్యం
- అనర్హులకు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు బాధ్యతలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దంతాలపల్లి: మండల కేంద్రంలోని ఆస్పత్రి పేరు వినగానే ప్రజలకు నమ్మకం కలిగేది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం. అలాంటి పీహెచ్‌సీలో సిబ్బంది కొరత, సరైన వైద్య సేవలు అందక ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉమ్మడి నర్సింహులపేట, దంతాలపల్లి మండలాలకు సేవలు అందిస్తోంది. దాదాపు 70వేల జనాభా ఈ ఆస్పత్రి పైనే ఆధారపడుతున్నారు. ఈ ఆస్పత్రిలో ఇద్దరు వైద్యులు, 12మంది ఫస్ట్ ఏఎన్‌ఎంలు, 12మంది సెకండ్ ఏఎన్‌ఎంలు ఉండాలి. కాని ప్రస్తుతం 4 ఫస్ట్ ఏఎన్‌ఎంలు, 10 సెకండ్ ఏఎన్‌ఎంలు మాత్రమే పని చేస్తున్నారు. దీంతో సరైన వైద్య సేవలు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డెంగీ, చికెన్‌గున్యా మలేరియా వంటి వ్యాధులు పెరుగుతున్నందున, రోజుకు 100నుంచి 150 మంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారు. కాని రోజుకు ముగ్గురు నర్సులు మాత్రమే డ్యూటీలో ఉంటున్నారు. ఇటీవల ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు పోస్టుల్లో ఉన్నవారు ఇతర ప్రాంతాలకు డిప్యూటేషన్‌పై వెళ్లారు. అర్హతలేని ఏఎన్‌ఎంలకు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టు బాధ్యతలు అప్పగించారు. దీంతో వైద్య సేవలకు ఆటంకం కల్గుతోంది. తక్షణమే అర్హత గల ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సిబ్బందిని నియమించాలి



అర్హత లేని ఏఎన్‌ఎంలు ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టులు సేవలు అందిస్తున్నారు. ఒక నర్సు మాత్రమే రోగులకు చికిత్స అందిస్తోంది. దీంతో గంటల తరబడి రోగులు వేచి చూస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో సిబ్బందిని నియమించి, రోగులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

\- సేను రాజేష్, దంతాలపల్లి

మహిళలను కోటీశ్వరులను చేయడమే ధ్యేయం

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్: గత ప్రభుత్వం మహిళలను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మున్సిపాలిటీ దాని అనుబంధ మెప్మా ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి డ్వాక్రా గ్రూపులకు వడ్డీ లేని రుణాలు ఇచ్చి, మహిళా సాధికారతకు కృషి చేశారన్నారు. సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరునే ఉన్నాయని, వారికి సముచిత స్థానం కల్పించడం కోసం ప్రభుత్వం పాటుపడుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజేశ్వర్, మెప్మా డీఎంసీ విజయ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, పర్యావరణ అధికారి క్రాంతి, నాయకులు దిలీప్, ఎడ్ల రమేష్, ఖలీల్, నారాయణ, లక్ష్మినారాయణ, రాజు, గిరిధర్ గుప్తా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కిచెన్ షెడ్డే అంగన్‌వాడీ కేంద్రం..

మహబూబాబాద్ రూరల్: మండలంలోని దర్గా తండాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని కిచెన్ షెడ్డునే అంగన్‌వాడీ కేంద్రంగా వినియోగిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం లేకపోవడంతో పాఠశాల కిచెన్ షెడ్డును పిల్లల సౌకర్యార్థం అంగన్‌వాడీ కేంద్రంగా వినియోగిస్తున్నప్పటికీ ఆ గది ఏమాత్రం సౌకర్యవంతంగా లేదు. పైగా కిచెన్ షెడ్డు ముందు భాగంలో వేసిన రేకుల్లో రెండు గాలి దుమారానికి కొట్టుకుపోయాయి. చిన్నపాటి వర్షం వచ్చినా సరే అంగన్‌వాడీ టీచర్, ఆయా విద్యార్థులకు ఆ సమీపంలో గల ఇళ్లు, పాఠశాల వద్దకు తీసుకువెళ్లి పోషకాహారాన్ని అందిస్తున్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం ఉత్తర్వులు చేసినప్పటికీ నిర్మాణ పనులు చేపట్టేందుకు ఎవరు ముందుకు రావడం లేదు.



రేకులు లేని కిచెన్ షెడ్డులో అంగన్‌వాడీ కేంద్రం

ఓసీ క్లబ్ ముమ్మాటికి ప్రభుత్వానిదే..

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలో గల ఓసీ క్లబ్ ముమ్మాటికి ప్రభుత్వానిదేనని, ఓసీ క్లబ్ స్థలాన్ని ప్రజా బహుళ అవసరాలకు ప్రభుత్వం వినియోగించాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి డిమాండ్ చేశారు. ఓసీ క్లబ్ స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం నుంచి క్లబ్ స్థలం ఎదుట దీక్షలు చేపట్టారు. ఈసందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. జిల్లాకేంద్రం నడిబొడ్డున ఉన్న రూ.50కోట్ల విలువైన భూమి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో చెలామణి అవుతుందని, వెంటనే ప్రభుత్వం ఓసీ క్లబ్‌ను స్వాధీనం చేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. 4వ తేదీన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సహాయ కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న, జిల్లా కార్యవర్గ సభ్యురాలు మామిండ్ల సాంబలక్ష్మీ, నాయకులు వెలుగు శ్రావణ్, మేక వీరన్న, ఆబోతు అశోక్ పాల్గొన్నారు.



దీక్షను ప్రారంభించి మాట్లాడుతున్న అజయ్‌సారథిరెడ్డి

నీటి వృథాను అరికట్టడమే లక్ష్యంగా..

పెద్దవంగర: వర్షపు నీటి వృథాను అరికట్టడమే లక్ష్యంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ స్వచ్ఛంద సంస్థ కృషి చేస్తుందని ఎంఈఓ బుదారపు శ్రీనివాస్ అన్నారు. సీజీఆర్ సంస్థ ప్రతినిధులు మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఇంకుడు గుంతలు, ఔషధ మొక్కలు నాటేందుకు అనువైన స్థలంగా గుర్తించి గురువారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి జీవన్, మాజీ ఉప సర్పంచ్ శ్రీరాం పురుషోత్తం, ఉపాధ్యాయులు కవిరాజు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరాలు

గంగారం: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని గంగారం వైద్యాధికారి ప్రత్యూష అన్నారు. మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.

పెద్దవంగర: ఉచిత ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ సర్పంచ్ పాకనాటి రామకృష్ణారెడ్డి సూచించారు. గురువారం మండలంలోని చిన్నవంగర గ్రామంలో జనవికాస ఆధ్వర్యంలో మెడికేర్ హాస్పటల్ తొర్రూరు సహకారంతో ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

పందుల స్వైరవిహారం

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కంకరబోడ్ ప్రాంతంలోని పాత సమైక్య జూనియర్ కాలేజీ పక్కన చెత్తాచెదారం పేరుకుపోయింది. దీంతో ఈ ప్రాంతంలో పరిసరాలు అపరిశుభ్రంగా మారి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. దాంతో దోమల సంఖ్య పెరిగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామ సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మరిపెడ రూరల్: మండలంలోని గుండెపూడి గ్రామంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు బానాల రాజన్న, బోడపట్ల రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దత్తత గ్రామమైన గుండెపూడి గ్రామంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయన్నారు. వీధిలైట్లు, సైడ్ డ్రెయినేజీ, బురద అంతర్గత రహదారులతో ప్రజలు అవస్థలు పడుతున్నారని వాపోయారు. దోమలు వ్యాపించి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అధికారులు స్పందించి తక్షణమే సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ షరీఫ్, బయ్యా సురేష్, రమేష్, ఎల్లయ్య, నారాయణ పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లు అధ్వానం

కురవి: మండలంలోని నారాయణపురం శివారు కొత్తతండా, బలపాల శివారు లింగ్యా తండాలోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారి అధ్వానంగా మారాయి. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అంతర్గత రోడ్లు బురదమయంగా మారడంతో నడిచే పరిస్థితి కనిపించడంలేదు. సీసీ రోడ్లపై సైతం నీరు నిల్వ ఉండడంతో ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని తండావాసులు కోరుతున్నారు.



నారాయణపురం కొత్త తండాలో బురదగా అంతర్గత రోడ్డు

పనిగంటల పెంపు రాజ్యాంగ వ్యతిరేకం



ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు

నెహ్రూసెంటర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికవర్గంతో అదనంగా రెండు గంటలు పని చేసేలా పనిగంటల పెంపు రాజ్యాంగ వ్యతిరేకమని టీయూసీఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బిలకంటి సూర్యం అన్నారు. సంఘం ఆధ్వర్యంలో కార్మికులు జిల్లా కేంద్రంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. 8గంటల పని విధానం కోసం దేశ వ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరిగాయని, కార్మికులు తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా హక్కులు సాధించుకున్నారని గుర్తు చేశారు. కేంద్రంలో మోదీ కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను అమలు చేస్తూ కార్మికవర్గాన్ని బానిసలుగా చిత్రీకరించేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం లేబర్ అధికారికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అరవపల్లి వెంకన్న, బానోత్ రాంలాల్, పాడియా బిక్కు, శ్రీరాం పుల్లయ్య, వడ్లకొండ లక్ష్మయ్య, ముంజంపల్లి వీరన్న, ఉమ్మగాని సత్యం పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదు

దోర్నకల్: మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ తోపాటు బీఆర్‌ఎస్ నాయకులకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. డోర్నకల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, ప్రజాసంక్షేమాన్ని విస్మరించి దోపిడీ చేశారన్నారు. డిప్యూటీ స్పీకర్ డాక్టర్ రాంచంద్రునాయక్ నియోజకవర్గ అభివృద్ధి కోసం చేస్తున్న కృషి, ప్రజల నుంచి వస్తున్న ఆదరణ చూసి రెడ్యానాయక్ ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కాలా సుమేర్‌చంద్‌జైన్, ఉపాధ్యక్షుడు ఎల్లావుల హరికృష్ణ, శీలం శ్రీనివాస్, తారాచంద్, మాదా శ్రీనివాస్, హనుమంతరావు, మహేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

బ్రిడ్జి నిర్మాణంలో పాలకులు విఫలం

- సీపీఐ జిల్లా నాయకుడు వెంకన్న

గార్ల: పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మించడంలో పాలకులు వైఫల్యం చెందారని సీపీఐ జిల్లా నాయకుడు జంపాల వెంకన్న ఆరోపించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో నాటి ఎమ్మెల్యే హరిప్రియ బ్రిడ్జి నిర్మాణంకు రూ.15 కోట్లు మంజూరు చేయించి, మంత్రులను పిలిచి బ్రిడ్జి నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారన్నారు. ప్రభుత్వం మారిన అనంతరం బ్రిడ్జి నిర్మాణం మళ్లీ ఎక్కడి వేసిన గొంగళి అక్కడే ఉన్న చందంగా ఉందన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పందించి బ్రిడ్జి నిర్మాణం కోసం నిధుల మంజూరుకు కృషి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రమేష్, జనార్దన్, నర్సింహరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జంపాల వెంకన్న

రేషన్ కార్డుల పంపిణీతో పేదలకు న్యాయం



రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న చైర్మన్, తహసీల్దార్

కురవి: పదేళ్ల బీఆర్‌ఎస్ కాలంలో పేద వారికి రేషన్ కార్డులు దక్కలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలందరికి తెల్లరేషన్ కార్డులు పంపిణీ చేయడంతో పేదలకు న్యాయం జరిగిందని మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అన్నారు. గురువారం సీరోలు మండలం చింతపల్లి, కొత్తూరు(సీ) గ్రామాల్లో పేదలకు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. రేషన్ కార్డులతో సన్నబియ్యంతోపాటు ప్రభుత్వం అందజేసే అనేక సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో సీరోలు తహసీల్దార్ పున్నంచందర్, కార్యదర్శి అశోక్, రేషన్‌డీలర్ మలిశెట్టి సత్యనారాయణ, మండల అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, నాయకులు మలిశెట్టి వేణు, బుడిగె లక్ష్మయ్య, రాయభారపు వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత

దోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డు నుంచి యాదవనగర్‌కు వెళ్లే మార్గంలో కొద్ది రోజుల క్రితం పైపులైన్ పగలడంతో తవ్వకాలు జరిపి వదిలేయడంతో రోడ్డు పక్కన గుంత ప్రమాదకరంగా మారింది. స్కూల్ బస్సులు ఈ మార్గం మీదుగా వెళ్తుంటాయి. వెంటనే గుంతను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.



రోడ్డు పక్కన ప్రమాదకరంగా గుంత

సంక్షిప్త సమాచారం

గురుకులం నుంచి తప్పించుకున్న విద్యార్థి

దంతాలపల్లి: మండలకేంద్రంలోని ఓ విద్యార్థి గురువారం ఉదయం 4:30గంటలకు గురుకులం నుంచి తప్పించుకున్న ఘటన చోటుచేసుకుంది. వివరాల ప్రకారం మండలంలోని దాట్ల గ్రామానికి చెందిన పస్తం మంజు అనే విద్యార్థి మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులంలో 9వ తరగతి చదువుతున్నాడు. గురువారం తెలవారుజామున మంజు ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లాడు. సిబ్బంది నిర్లక్ష్యం వల్ల విద్యార్థి తప్పించుకున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

జీవాలకు వ్యాక్సినేషన్

చిన్నగూడూరు: నీలి నాలుక వ్యాధి(బ్లూ టంగ్) వ్యాక్సిన్లు అన్ని జీవాలకు సరిపడా ప్రభుత్వం పంపిణీ చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు పయ్యావుల మల్లయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో సంఘం ఆధ్వర్యంలో పశువైద్యశాల డాక్టర్ రాంచందర్ సిబ్బందితో కలిసి జీవాలకు వ్యాక్సిన్ కార్యక్రమం నిర్వహించారు.

విప్లవోద్యమంలో నిబద్ధత గల వ్యక్తి




బయ్యారం: విప్లవోద్యమ ప్రస్థానంలో లింగన్న నిబద్ధత గల వ్యక్తి అని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. మండల కేంద్రంలో గురువారం లింగన్న వర్ధంతి సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. 20 సంవత్సరాల వయసులో విప్లవోద్యమ ప్రస్థానం ప్రారంభించిన లింగన్న అంచెలంచెలుగా రాష్ట్ర కమిటీ సభ్యుడిగా స్థాయికి ఎదిగారన్నారు. ఈ సభలో నాయకులు చలపతిరావు, గోవర్ధన్, గౌని ఐలయ్య, వెంకన్న, మురళీకృష్ణ, ఐలయ్య, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ పాల్గొన్నారు.

సన్మానం

దంతాలపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ అందించేలా కృషి చేయాలని తొర్రూరు డీఈ రవి, జిల్లా సెక్షన్ అధికారి శంకర్ అన్నారు. మండలంలోని లైన్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రాధాకృష్ణ పదవి విరమణ సభలో గురువారం నిర్వహించారు.

బోనాలతో విద్యార్థుల సందడి



కురవి: మండల కేంద్రంలోని గీతాంజలి పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు బోనాలు, పోతురాజుల విన్యాసాలతో గురువారం సందడి చేశారు. బోనాలు ఎత్తుకుని భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించారు.

కోబల్‌తండాలో తీజ్ వేడుకలు

గూడూరు: మండలంలోని కోబల్‌తండాలో గురువారం లంబాడ గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పెళ్లి కాని యువతులు వెదురు బుట్టల్లో గోధుమలు వేసి పెంచి, పూజలు చేశారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

దోర్నకల్: ప్రభుత్వం రేషన్ డీలర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు తేజావత్ లక్ష్మానాయక్ కోరారు. డోర్నకల్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లకు ఐదు నెలలుగా కమీషన్ డబ్బులు అందడం లేదన్నారు. ఈ సమావేశంలో రాజారాం, పంజాల వీరన్నగౌడ్, బానోత్ సేట్రాం, నున్నా రాంబాబు, రమేష్ పాల్గొన్నారు.

సాహిత్య అభిరుచి కలిగి ఉండాలి

కురవి: విద్యార్థులు సాహిత్య అభిరుచి కలిగి ఉండాలని జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ చారి అన్నారు. గురువారం మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్‌లో సాహితీవేత్త వంశీప్రేమ్‌చంద్ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట శ్రీరాములు, దీపిక, రజిత, సలీం, విష్ణు, వీరన్న, బలాష్టి రమేష్, రచ్చ వెంకన్న పాల్గొన్నారు.

నేటినుంచి చతుర్వేద పారాయణ యజ్ఞాలు

మహబూబాబాద్ రూరల్: శ్రావణమాస పూజల్లో భాగంగా శుక్రవారం నుంచి సోమవారం వరకు నాలుగు రోజులపాటు వరకు చతుర్వేద పారాయణ యజ్ఞాలు నిర్వహిస్తున్నామని ఆర్య సమాజ్ ట్రస్ట్ అధ్యక్షులు నారాయణప్రకాష్ లోయ గురువారం తెలిపారు. యజ్ఞంలో పాల్గొనే దంపతులు 98664 08384 నంబరులో సంప్రదించగలరని సూచించారు.

ఏపీఎంకు సన్మానం

దోర్నకల్: స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఏపీఎంగా విధులు నిర్వహించి, బదిలీపై వెళ్తున్న శంకర్ నాయక్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. పదేళ్లుగా ఏపీఎంగా విధులు నిర్వహించిన శంకర్‌నాయక్ మహబూబాబాద్ ఏపీఎంగా బదిలీపై వెళ్తున్న సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం కార్యాలయంలో సీసీలు, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.

వెలగని వీధి దీపాలు



చిన్నగూడూరు: మండల కేంద్రంలో వీధి దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లేక పలు వీధుల్లో చీకట్లు కమ్ముకున్నాయి. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్ నుంచి దాశరథి గ్రంథాలయం వరకు కొంత కాలంగా వీధి దీపాలు వెలగడం లేదు. గురువారం రాత్రి వీధి దీపాలు వెలగకపోవడంతో చిమ్మ చీకటికమ్ముకుంది. వర్షాకాలం కావడంతో పాములు, తేళ్లు వంటి విష పురుగులు బయట సంచరిస్తున్నాయి. అధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలపై చర్య తీసుకోవాలి

మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కురవి మండల కేంద్రంలోని విద్యాశాఖకు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న సిద్ధార్థ పాఠశాలపై చర్య తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శి జ్యోతి బస్సు, పట్ల మధు అన్నారు. జిల్లా కేంద్రంలో డీఈఓ రవీందర్‌రెడ్డికి అనుమతులు లేని పాఠశాలలపై చర్య తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు వంశీ, అరుణ్, యాకన్న మహేష్, వరుణ్ పాల్గొన్నారు.

రమేశ్ మృతి పార్టీకి తీరనిలోటు

కురవి: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాజోలు గ్రామ నాయకుడు కుర్రి రమేశ్ మృతి విప్లవ ఉద్యమానికి, పార్టీకి తీరనిలోటని పార్టీ కురవి సబ్ డివిజన్ సహాయ కార్యదర్శి సామ పాపయ్య, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్ అన్నారు. గురువారం రాజోలు గ్రామంలో రమేష్ సంతాపసభ జరిగింది. కార్యక్రమంలో కృష్ణ, భిక్షం, కబూల్, మల్లేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



కేసముద్రం: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన జూనియర్, సబ్ జూనియర్ అథ్లెటిక్స్ జిల్లాస్థాయి ఎంపిక పోటీల్లో మున్సిపాలిటీ పరిధి గిరిజన గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఐశ్వర్య, హన్సిక, కిరణ్మయి, నిత్య, చరణ్య, నందిని, స్వాతి, ఇందు, మీనాక్షి, పౌర్ణమి ప్రతిభ కనబర్చి పతకాలను సాధించినట్లు ప్రిన్సిపాల్ హర్షిత తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ విజయనిర్మల, పీడీ స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీలత, సునీత పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన



నెల్లికుదురు: మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునర్ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో భాగంగా గురువారం వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శివ పార్వతీ కల్యాణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మురళీనాయక్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

జయప్రదం చేయాలి

తొర్రూరు: ఆగస్టు 10న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగే సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం విశ్రాంతి భవనంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి రమేష్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మల వెంకన్న, చీకర్ శ్రీనివాస్, కంతమహేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

'వైద్యుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి'

మహబూబాబాద్: బాలింత పద్మ మృతికి కారణమైన డాక్టర్ అర్జున్‌రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోత్ భీమానాయక్ లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బోడ రమేశ్ డిమాండ్ చేశారు. ఎల్‌హెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేసి వైద్యుడిపై చర్య తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు.

సౌకర్యాలు కల్పించాలి



మహబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా బయ్యారం మండలంలోని కాంచనపల్లి గ్రామ పంచాయతీ ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న మోట్లగూడెం ప్రభుత్వ పాఠశాలకు యూ డైస్ కోడ్ కేటాంచి విద్యార్థుల చదువులకు సౌకర్యం కల్పించాలని డీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర నాయకుడు మాలోతు శాంతి కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో గురువారం డీఈఓ రవీందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయి కుమార్, సూర్యప్రకాష్, శ్రీకాంత్, దేవేందర్, వీరన్న పాల్గొన్నారు.

ఎండీఎం పత్రాలపై బాలుడితో వేలిముద్రలు



పత్రాలపై బాలుడితో వేలి ముద్రలు వేయిస్తున్న ఉపాధ్యాయురాలు

మరిపెడ రూరల్: మధ్యాహ్నం భోజనం బిల్స్ (ఎండీఎం) పత్రాలలో ఓ బాలుడితో వేలి ముద్రలు పెట్టించి, ఈ బిల్స్ పత్రాలను కార్యాలంలో సిబ్బందికి అందేసిన సంఘటన మరిపెడ మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం ఎదుట గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. జూలై నెల ఎండింగ్ కావడంతో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు ఆయా పాఠశాల, మిడ్డే మిల్స్ బిల్స్‌కు సంబంధించిన పత్రాలను విద్యా వనరుల కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది. ఇందుకు మధ్యాహ్న మిల్స్‌పత్రాలను వంట నిర్వాహకుల సంతకాలు చేసి అందించాల్సి ఉంది. కానీ ఓ ఉపాధ్యాయురాలు రూల్స్ పట్టింపు లేకుండా ఆమెతో వచ్చిన బాలుడితో బిల్స్ పత్రాలపై అందరు చూస్తుండగా ఇంకు ప్యాడ్ తీసి సుమారు 10వేలి ముద్రలను బిల్స్ పత్రాలపై పెట్టించి కార్యాలయంలో అప్పగించింది. అక్కడే ఉన్న పలువురు అదేమి విచిత్రమంటు అవాక్కయ్యారు.